గ్రూపు-1 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న పరీక్షల నిర్వాహణాధికారి ఎర్ర అంజయ్య, పోలీసులు

రాజేంద్రనగర్: నేడు జరగనున్న తెలంగాణ రాష్ట్ర గ్రూపు-1 ప్రిలిమినరీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్, పరీక్షల నిర్వాహణాధికారి ఎర్ర అంజయ్య తెలిపారు. శనివారం కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు.

పరీక్ష ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగతుందన్నారు. అభ్యర్థులను ఉదయం 9 నుంచే పరీక్ష హాల్‌లోకి అనుమతిస్తామని హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వం గుర్తించిన ఏదైనా ఒక ఒరిజినల్ గుర్తింపు కార్డు తీసుకురావాలని సూచించారు. 10 గంటల తర్వాత పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉండదని, అభ్యర్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, షూస్, చేతి గడియారం ధరించవద్దన్నారు. బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి, లేకుంటే వారి ఫలితాలను నిలిపివేయనున్నట్లు టీజీపీఎస్సీ ప్రకటించిందని తెలిపారు. రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 312 మంది అభ్యర్థులు గ్రూప్-1 పరీక్ష రాయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పరీక్షల పరిశీలకులు వేణుగోపాల్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ హరిప్రియ, స్పెషల్ ఇన్విజిలేటర్లు మాన్య, స్వప్న, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్ రావు, ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబు కూడా పరీక్షా కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు.

పరిసరాల శుభ్రతతోనే రోగాలు దూరం


జీహెచ్‌ఎంసీ సిబ్బందితో సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్

మైలార్‌దేవ్‌పల్లి: పరిసరాలు శుభ్రంగా ఉంటే రోగాలు దరిచేరవని రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి ఓల్డ్ విలేజ్‌లో శానిటేషన్ సిబ్బంది పని తీరును శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్లపై చెత్తను వేయవద్దని, ప్రతి ఇంటి ముందు చెత్త డబ్బాలు ఏర్పాటు చేసి అందులోనే చెత్తను వేస్తే జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన చెత్త సేకరించే ఆటోలు వచ్చి చెత్తను తీసుకెళ్తాయని పేర్కొన్నారు. రోడ్లపై చెత్త వేసే వారికి రూ. 500 జరిమానా విధించాలని శానిటరీ సూపర్‌వైజర్‌కు సూచించారు. కార్యక్రమంలో డీఈ శ్రీనివాసులు, ఎస్.ఎస్. రమేశ్, ఎస్‌ఎఫ్‌ఏలు సంగీత, జగన్, మహేందర్ జాషువా, సురేశ్ ఉన్నారు.

చంద్రశేఖర్‌రెడ్డికి డాక్టరేట్ ప్రదానం


డాక్టరేట్ అందుకుంటున్న చంద్రశేఖర్‌రెడ్డి

మణికొండ: జాతీయ స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు, నార్సింగి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డికి అమెరికన్ డ్స్పిరింగ్ క్రిస్టియన్ యూనివర్సిటీ వారు శనివారం సికింద్రాబాద్‌లో డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ స్మిమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, స్విమ్మర్‌గా తాను చేసిన కృషిని గుర్తించి డాక్టరేట్ ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు.డాక్టరేట్‌తో తన బాధ్యత మరింత పెరిగిందని పేర్కొన్నారు. జీజీపీపీ చైర్మన్ డాక్టర్ ప్రభుకిరణ్, మహిళా అధ్యక్షురాలు టి.సునీత రివరెండ్, ప్రొఫెసర్ రాజాజీ ప్రసాద్, మాస్టర్ స్విమ్మర్ డాక్టర్ క్వీన్ విక్టోరియా డాక్టరేట్ అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య


బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయురాళ్లు , ఉపాధ్యాయులు, విద్యార్థులు

అత్తాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని అత్తాపూర్ జడ్పీ పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయురాళ్లు శ్రీలత, జమీర్ ఫాతిమా అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు శనివారం అత్తాపూర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్కులు యూనిఫాంలతో పాటు బూట్లు తదితర సామగ్రిని ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నదన్నారు. ఇది బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, ఈ మేరకు తల్లిదండ్రులు ఆలోచించి సర్కారు స్కూళ్లలో జాయిన్ చేయించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆధ్యాయబేగం, రోజా, రాణి, సరళ, జ్యోతి, చంద్రశేఖర్, సౌమ్య, రజియాబేగం తదితరులు ఉన్నారు.

రాజీ మార్గంతో కేసుల సత్వర పరిష్కారం


కేసులను పరిష్కరిస్తున్న రాజేంద్రనగర్ న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు న్యాయమూర్తి నీలిమా

రాజేంద్రనగర్: రాజీమార్గంతో కేసులను పరిష్కరించుకోవాలని రాజేంద్రనగర్ మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు న్యాయమూర్తి నీలిమా అన్నారు. రాజేంద్రనగర్‌లో శనివారం ఆమె ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 10,437 కేసులు పరిష్కరించారు. ఇందులో రాజీపడిన కేసులు 144, అడ్మిషన్ కేసులు 188, డ్రంక్ అండ్ డ్రైవ్ 1521, ఈ-పెట్టి కేసులు 8330, విద్యుత్ చౌర్యం కేసులు 253, 1 బ్యాంక్ కేసులు ఉన్నాయి. కార్యక్రమంలో 12వ అదనపు న్యాయమూర్తి రాజ్ కిరణ్, స్పెషల్ కోర్టు న్యాయమూర్తి రానోజి, ఏపీపీలు ప్రవీణ్ నాయక్, సంగీత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శీలం వెంకట్ రెడ్డి, కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు సుదర్శన్, సుధాకర్ రెడ్డి, సుజాత, వరప్రసాద్, శ్రీనివాసులు, కోర్టు సిబ్బంది వెంకటరంగారెడ్డి, నరేశ్ గౌడ్, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది, బార్ అసోసియేషన్ సభ్యులు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

లార్డ్స్ కళాశాలలో 'హ్యాక్‌ప్రిక్స్' షురూ


పాల్గొన్న విద్యార్థులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హిమాయత్‌సాగర్‌లో గల లార్డ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీలో హ్యాక్‌ప్రిక్స్ -2024 శనివారం ప్రారంభమైంది. రెండు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దీనిద్వారా విద్యార్థులు తమ ప్రాజెక్ట్‌ను పిచ్ చేసేందుకు, వారి ఆలోచనలను సహచరులకు, స్పాన్సర్ ప్రతినిధులకు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అలాగే విజేతలకు భారీగా నగదు బహుమతి అందిస్తామన్నారు. 80కి పైగా నగరాల నుంచి సుమారు 550 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని కళాశాల జనరల్ సెక్రటరీ తన్వీర్ తెలిపారు. విద్యార్థులు, ఫ్యాకల్టీల విజన్, హ్యాక్‌ప్రిక్స్‌ను రియాలిటీగా మార్చిందన్నారు. 36 గంటల లాంగ్ హ్యాక్‌థాన్‌కు తెలంగాణ రాష్ట్రంలో 1300 కంటే ఎక్కువ రిజిస్ట్రేషన్లు పొందిందని పేర్కొన్నారు.

అడుగుకో గుంత.. నిత్యం చింత!

- రాకపోకలకు ఇబ్బందులు
- మరమ్మతులు చేయాలంటున్న ప్రజలు
- విస్మరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

అధ్వానంగా అంతర్గత రహదారులు


జనప్రియ వెస్ట్‌సిటీ కాలనీలో గుంతలమయమైన రోడ్డు

మియాపూర్: కాలనీలో అంతర్గత రహదారులు అధ్వానంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. గుంతలమయంగా మారిన రోడ్లలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. ఒక సమస్యను పరిష్కరించబోయి మరో సమస్యను తెచ్చిపెట్టారని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మారినప్పటి నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

చిన్న పాటి వర్షానికే గుంతలు..

మియాపూర్‌లోని జనప్రియ వెస్ట్‌సిటీలో రోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రజలు అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. వర్షాలు పడితే పరిస్థితి మరింత అధ్వానంగా ఉంటుందని, రోడ్లన్నీ బురదమయంగా మారే అవకాశముందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిపోయిందనే చందంగా పరిస్థితి మారిందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో ఎక్కడపడితే అక్కడ అవసరమున్నా లేకున్నా... రోడ్లను ఇష్టానుసారంగా తవ్వి వదిలేశారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల కోసం రోడ్లను తవ్వి పైపులైన్ పనులు నిర్వహించి మరమ్మత్తులు చేయకుండా రోజుల తరబడి అలాగే వదిలేశారు.



ఇష్టానుసారంగా తవ్వకాలు..

రోడ్డును మధ్యలో తవ్వి పనులు చేపట్టి ఆ గుంతలలో మట్టిని పూడ్చి చేతులు దులుపుకున్నారు. తవ్విన ప్రాంతంలో మరమ్మతులు కానీ, సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టకపోవడంతో గుంతలు దర్శనమిస్తున్నాయి. వర్షాకాలం ప్రారంభమైంది. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికే రోడ్డును తవ్విన ప్రాంతంలో మట్టి కొట్టుకుపోయి గుంతలమయంగా మారాయి. వరద నీటిలో ఎక్కడ గుంతుందో కనిపించక వాహనాదారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడే అవకాశముందని భయాందోళన చెందుతున్నారు. కాలనీలో అడుగడుగునా గుంతలు దర్శనమిస్తున్నాయి. భారీ వర్షాలు పడితే గుంతల్లో మట్టి పూర్తిగా కొట్టుకుపోయి పెద్ద పెద్ద గుంతలు పడే అవకాశముందని త్వరగా అధికారులు స్పందించి సీసీ రోడ్డు పనులు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి..



కాలనీలో డ్రైనేజీ పైపులైన్ పనులు పూర్తిచేసి రోజులు గడుస్తున్న ఇప్పటి వరకు తవ్విన ప్రాంతంలో రోడ్లకు మరమ్మతులు కానీ, సీసీ రోడ్డు కానీ వేయలేదు. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో ఉన్న మట్టి కొట్టుకుపోయి రోడ్డు గుంతలమయంగా మారింది. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు స్పందించి త్వరగా రోడ్డు పనులను పూర్తి చేయాలి.

– శివకుమార్, స్థానికుడు

ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి



మణికొండ: ప్రస్తుత పరిస్థితిల్లో ప్రతిఒక్కరూ ఆరు నెలలకు ఒకసారి తప్పనిసరిగా అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించుకోవాలని నార్సింగి మున్సిపాలిటీ కోకాపేట నాలుగో వార్డు కౌన్సిలర్ ఎ. దుర్గేశ్‌యాదవ్ అన్నారు. తన వార్డు పరిధిలోని పోచమ్మ బస్తీలో న్యూ ఇరా డయాగ్నోస్టిక్ వారు శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వైద్యుల సలహాల ప్రకారం మందులు వాడడంతో పాటు ఆహార అలవాట్లలో మార్పు చేసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. కార్యక్రమంలో డయాగ్నోస్టిక్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ



గోల్కొండ: ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వం తక్షణమే ట్రైబల్ అడ్వైజరీ కమిటీ తీర్మానం చేసి వంద శాతం రిజర్వేషన్ అమలు చేయాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌నాయక్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన మాసాబ్‌ట్యాంక్‌లో చలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణలో డీఎస్‌ఈ-2024లో నోటిఫికేషన్ ప్రకటనలో ఆర్టికల్ 244 (1) అనుసరించి ఏజెన్సీ ప్రాంతంలో 100 శాతం ఉద్యోగాలను స్థానిక గిరిజన అభ్యర్థులతోనే భర్తీ చేయాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అన్నారు. ప్రభుత్వం మెగా డీఎస్‌ఈ నోటిఫికేషన్ ఇచ్చిన నేపథ్యంలో ఏజెన్సీ డీఎస్‌ఈ, జనరల్ డీఎస్‌ఈ రెండు రకాల నోటిఫికేషన్‌ను ప్రకటించాలన్నారు. షెడ్యూల్ ట్రైబల్స్‌కు న్యాయం చేకూర్చాలన్నదే తమ డిమాండ్ అని ఆయన అన్నారు. దీని కోసం తాము ఈ నెల 28న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని తలపెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాష్‌రాథోడ్, కార్యదర్శి గోవింద్‌నాయక్, వడిత్య రమేష్‌నాయక్, సురేష్‌నాయక్ తదితరులున్నారు.

మణికొండలో ఎగ్జిబిషన్‌కు ఆదరణ


హ్యాండ్ బ్యాగులు, పర్సులు కొనుగోలు చేస్తున్న మహిళలు


కొండపల్లి బొమ్మలను కొనుగోలు చేస్తున్న చిన్నారులు

మణికొండ: మణికొండ పైప్‌లైన్ రోడ్డులోని సుందర్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా హ్యాండ్లూమ్స్, హ్యాండీక్రాఫ్ట్ ఎగ్జిబిషన్ సేల్‌కు విశేష ఆదరణ వస్తున్నది. ఇందులో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్ లెనిన్, కలంకారి, బెంగాల్ కాటన్ చీరలతో పాటు డ్రస్ మెటీరియల్, డిజైనర్ బ్లౌస్‌లు, ఖాదీ మెటీరియల్, వన్ గ్రాం గోల్డ్ జ్యువలరీ, జైపూర్ బెడ్‌షీట్, కొండపల్లి బొమ్మలు, పర్సులు, గృహోపకరణ వస్తువులను విక్రయిస్తున్నారు. అనేక రాష్ట్రాల్లోని చేతి వృత్తి కళాకారులు తయారు చేసిన వస్తువులన్నీ ఒకే చోట నాణ్యతతో లభిస్తుండటంతో కొనుగోలుదారుల నుంచి మంచి స్పందన ఉందని నిర్వాహకులు తెలిపారు. ఎగ్జిబిషన్ కొన్ని రోజులు మాత్రమే ఉంటుందని, మణికొండ, నార్సింగి మున్సిపాలిటీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

అమర్‌నాథ్ యాత్రికులకు అందుబాటులో ప్రత్యేక దుస్తులు



చార్మినార్: జమ్మూ, కశ్మీర్-అమర్‌నాథ్ యాత్రకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం చలితో పాటు వర్షాన్ని సైతం తట్టుకునే విధంగా తమ వద్ద ప్రత్యేక దుస్తులు అందుబాటులో ఉన్నాయని మహ్మద్ క్యాప్ మార్ట్ మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ ఇలియాస్ బుకారీ తెలిపారు. అంతే కాకుండా వర్షాకాలం సందర్భంగా అన్ని రకాల రెయిన్ కోట్‌లు అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉన్నాయన్నారు. భరించలేనంతగా ఉండే చలిని సైతం లెక్కచేయకుండా యాత్రికులు అమర్‌నాథ్‌కు వెళుతుంటారని..యాత్రికుల సౌకర్యార్థం పాతబస్తీ మదీనా సర్కిల్‌లోని మహ్మద్ క్యాప్ మార్ట్ ఆధ్వర్యంలో ఉలెన్, నైలాన్ దుస్తులను ప్రత్యేకంగా తయారు చేయించి అందుబాటులోకి తెచ్చారు. ఈ మేరకు శనివారం మదీనా సర్కిల్‌లోని షో రూం వద్ద ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మహ్మద్ క్యాప్ మార్ట్ మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ ఇలియాస్ బుకారీ మాట్లాడుతూ.. ఎముకలు కొరికే చలిని సైతం తట్టుకునే విధంగా ప్రత్యేక దుస్తులను తయారు చేయించామన్నారు. నిపుణుల పర్యవేక్షణలో ప్రత్యేకంగా రూపొందించి తమ షో రూంలో అందుబాటులో ఉంచామని ఆయన వెల్లడించారు.

పాలపిట్ట పార్కు వేళలు

రాయదుర్గం: కొత్తగూడలోని తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, హైదరాబాద్ బైసైక్లింగ్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే పాలపిట్ట సైక్లింగ్ పార్కులో ఆహ్లాద పూరిత వాతావరణంలో సైకిల్ నడిపే అవకాశం

పని వేళలు..

- ఉదయం 5.30 గంటల నుంచి 10 గంటల వరకు
- సాయంత్రం 3.30 నుంచి రాత్రి 7 గంటల వరకు

సైకిళ్ల అద్దె వివరాలు..

- అడల్ట్స్/కిడ్స్-గంటకు రూ.59
- సొంత సైకిల్ తీసుకొస్తే నాలుగు గంటలకు రూ.59
- నెలవారీ పాస్ రూ.900

15న శాంతి సరోవర్‌లో ప్రత్యేక సదస్సు

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఈనెల 15న పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు ప్రత్యేక సెమినార్ నిర్వహించనున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే కార్యక్రమంలో 'ప్రాస్పరిటీ ఇన్ బిజినెస్ త్రూ ట్రెజర్స్ ఆఫ్ బ్లెస్సింగ్స్' అనే అంశంపై మౌంట్‌అబూకు చెందిన బి.కె.ఉషాదీదీ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. ఇదే కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ హైదరాబాద్ డైరెక్టర్ బి.కె.కుల్‌దీప్ దీదీ, అరబిందో ఫార్మా లిమిటెడ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ హెచ్‌ఆర్ డాక్టర్ యూఎస్‌బీ రాజు, ద్యూక్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ రవీందర్ అగర్వాల్, టీహెచ్‌సీసీఎంఏ అజయ్‌కుమార్ అగర్వాల్ పాల్గొంటారు. మరిన్ని వివరాలకు 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

ఢిల్లీకి తరలిన బీజేపీ నాయకులు


ఢిల్లీకి బయల్దేరి వెళ్తున్న నాయకులు

అత్తాపూర్: నేడు భారత ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడం మల్లారెడ్డి, గుమ్మడి రామచంద్రారెడ్డి సిద్ధప్ప తదితరులు శనివారం ఢిల్లీకి పయనమయ్యారు. చేవెళ్ల ఎంపీగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడంతో ఆ పార్టీ అధి నాయకత్వం ఆహ్వానం పంపించడం ఆనందంగా ఉందని నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి


సరస్వతీ కాలనీలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సురేశ్‌గౌడ్

బండ్లగూడ: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ ప్రతినిధి గోకరి సురేశ్‌గౌడ్ అన్నారు. 18వ డివిజన్‌లోని సరస్వతీకాలనీ, వీరబ్రహ్మేంద్ర కాలనీలో విద్యుత్ సమస్య ఉందని స్థానికులు శనివారం ఆయన దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన ఆయన ఆయా కాలనీల్లో పర్యటించారు. తక్షణమే ఫోన్ ద్వారా విద్యుత్ అధికారులతో మాట్లాడారు. సాధ్యమైనంత త్వరగా విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు


శ్రీవేణుగోపాలాస్వామి ఆలయంలో ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ మంచిరేవుల శివారులోని శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలాస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం ధ్వజారోహణం, బలిహరణం, హారతి, ప్రసాద గోష్ఠి నిర్వహించారు. సాయంత్రం భేరి పూజ, దేవతాహ్వానం, హనుమంత వాహన సేవలు చేపట్టారు. ఈ నెల 9న (నేడు)ఉదయం 9 గంటలకు స్వామి వారికి అష్టోత్తర శతకలశాభిషేకం, సాయంత్రం 5 గంటలకు గరుడవాహన సేవ, ఎదుర్కోళ్లు , 7 గంటలకు శ్రీ వేణుగోపాలాస్వామి కల్యాణం ఉంటుందని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అర్చకులు పిలుపునిచ్చారు.

గ్రూప్-1 కోసం ప్రత్యేక బస్సులు

రాయదుర్గం: నగరంలో నిర్వహించే గ్రూప్-1 అభ్యర్థుల కోసం ఆర్టీసీ సంస్థ ప్రత్యేక బస్సులను నడుపుతోందని గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో మేనేజర్ మర్యాద మురళీధర్‌రెడ్డి శనివారం తెలిపారు. హెచ్‌సీయూ డిపో ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 7.30 గంటల నుంచి లింగంపల్లి, పటాన్‌చెరు బస్టాండ్ల నుంచి పరీక్ష కేంద్రాల రూట్లో ఈ ప్రత్యేక బస్సులను స్పెషల్ బోర్డులతో నడపడం జరుగుతుందన్నారు. రోజువారీగా నడిచే బస్సులతో పాటు ఈ అదనపు బస్సుల ను కూడా నడపాలని ఆర్టీసీ సంస్థ నిర్ణయించిందని పరీక్ష రాసే వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.